క్లుప్తంగా

నేడు విద్యుత్ సరాఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: ఇనుప స్తంభాలు మార్పు, చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో సోమవారం 11కేవీ టౌన్–1ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపేయనున్నట్లు ఆ శాఖ టౌన్ ఏఈ శివకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి 11:30 గంటల వరకు జిల్లా కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీ, మొమిన్ మహెల్లా, తెలుగుపేట, తేరుమైదానం, వడ్ల వీధి, బీసీ కాలనీ, శేరెల్లి వీధులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. మొమిన్‌మహెల్లాలో పాతట్రాన్స్‌ఫార్మర్ ప్లింత్ మార్చి కొత్త ప్లింత్ ఏర్పాటు చేయనున్న సందర్భంగా ఉదయం 11:30గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపేయనున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మల్దకల్: మండలంలోని నాగర్‌దొడ్డి, తాటికుంట, మద్దెలబండ విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, ఇతర పనుల కారణంగా సోమవారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు ఆయా విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అయిజ ఏడీఈ గోవిందు, మల్దకల్ ఏఈ దుర్గప్రసాద్‌లు తెలిపారు. ఈ విషయాన్ని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని వారు కోరారు.

కల్తీకల్లు విక్రయాలపై చర్యలు తీసుకోవాలి

అలంపూర్: గ్రామాల్లో అనుమతి లేకుండా కల్తీ కల్లు విక్రయిస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడులు రాజు, రేపల్లె దేవదాసులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అలంపూర్ మండలంలో ఈత, తాటి కల్లు కాకుండా కల్తీ కల్లు విక్రయాలు జోరుగా సాగుతున్నట్లు పేర్కొన్నారు. కల్తీ కల్లును అధికధరలకు విచ్చలవిడిగా విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఎక్సైజ్ అధికారులు కల్తీ కల్లు విక్రయాలను కట్టడి చేయాలని విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛమైన తాటి ఈత కల్లు విక్రయాలు జరిగే విధంగా చూడాలని కోరారు.

ఆలయానికి 25 తులాల వెండి వితరణ



కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలో కొండపై వెలసిన శ్రీపాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయానికి మండలంలోని పాగుంట గ్రామానికి చెందిన చాకలి మాణిక్యమ్మ కుటుంబ సభ్యులు 25 తులాల వెండి విరాళంగా శనివారం ఆలయ సిబ్బందికి అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి శేషవస్త్రాలతో వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



శాంతినగర్: అనారోగ్యంతో మృతిచెందిన మిత్రుని కుటుంబానికి పూర్వపువిద్యార్థులు ఆర్థిక సాయం అందజేసి ఉదారతను చాటుకున్నారు. వడ్డేపల్లి మండలం కొంకల గ్రామంలో 2006–2007 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన చాకలి శైలజ భర్త ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆమె కుటుంబం ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నారని తెలుసుకున్న పూర్వపు విద్యార్థులు రూ.60 వేలు ఆర్థిక సాయం, నూతన వస్త్రాలు అందజేశారు. బాధిత కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని మిత్రులందరు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టీజీ తిమ్మప్ప, శైలజ, పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని యాపర్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సూదిని నరేందర్‌రెడ్డి కుమారుడు సూదిని శ్రీహరిరెడ్డి కెనడా, అమెరికాలో స్థిరపడ్డాడు. ఆయన దసరా పండుగకు గ్రామానికి రావడంతో తోటి స్నేహితులతో కలిసి తాము చదువుకున్న ఉన్నత పాఠశాలను సందర్శించారు. వారం క్రితం అతను ఇచ్చిన రూ.3 లక్షలతో హైస్కూల్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు పరిశీలించి సంతృప్తి చెందినట్లు శ్రీహరిరెడ్డి తెలిపారు. రెండు పాఠశాలలకు సంబంధించిన అభివృద్ధి పనులు, సామగ్రి కొనుగోలు దశలవారీగా కొనసాగించాలని హెచ్‌ఎంను కోరారు. శనివారం హెచ్‌ఎం పీ.శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో పాఠశాలల్లో ఏర్పాటు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దాదాపు నలభై అయిదు ఏళ్ల కిందట తమ గ్రామంలో నిర్మించిన పాఠశాల శిథిలావస్థకు చేరడం చాలా బాధను కలిగించిందన్నారు. ఈ పాఠశాల పూర్వ విద్యార్థిగా అభివృద్ధికి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందిస్తానని ప్రకటించారు.



కిష్టాపురం గ్రామంలో దుర్గాదేవిని దర్శించుకున్న భక్తులు



వడ్డేపల్లిలో శమీ వృక్షానికి పూజలు నిర్వహించి జమ్మిపత్రి తెస్తున్న గ్రామస్థులు



జూలెకల్‌లో దుర్గమ్మ విగ్రహాన్ని వాహనంలో ఊరేగిస్తున్న భక్తులు

కనుల పండువగా విజయదశమి



అలంపూర్‌లో జోగులాంబ అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పిండి వంటలతో నైవేద్యం సమర్పణ
- శమివృక్షానికి పూజలు
- దుర్గామాతకు శోభాయాత్ర, నిమజ్జనం

సాక్షి, నెట్‌వర్క్: అలంపూర్: విజయ దశమి ఉత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. పండుగ రోజు ప్రజలు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయదశమి పండగను పురస్కరించుకొని పిండి వంటలు సిద్ధం చేసి దేవుడికి నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం బంధు–మిత్రులు, కుటుంబ సభ్యులతో శమివృక్షం వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. విజదశమి పండగా సందర్భంగా నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. కొందరు వాహనాలకు పూజలు చేయించారు. పరిశ్రమలు, కర్మాగారాలు, వ్యాపార సముదాయాల్లో సైతం ఆయుధ పూజలు చేశారు. గ్రామాల్లో క్రీడలు నిర్వహించారు.



అయిజలో కాళికాదేవి ఆలయంలో పూజలందుకున్న అమ్మవారు

- శాంతినగర్ రామాలయం, జూలెకల్‌లో దుర్గమ్మ విగ్రహాలకు శోభాయాత్ర నిర్వహించి తుంగభద్ర నదిలో నిమజ్జనం చేశారు.
- శ్రీపాగుంట లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పండుగ సందర్భంగా రథోత్సవం నిర్వహించారు.



మల్దకల్‌లో శమి వృక్షానికి పూజలు చేస్తున్న అర్చకులు రమేషాచారి



కేటీదొడ్డిలోని జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ నల్లా హనుమంతు



ఉండవెల్లిలో నిమజ్జనానికి బయలుదేరిన అమ్మవారు



ఉండవెల్లిలో అమ్మవారి ఊరేగింపులో ఆట, పాటలతో మహిళలు



పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి ఆలయం వద్ద పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు



ఉండవెల్లిలో జమ్మి చెట్టు వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

సమస్యల పరిష్కారానికి పోరాడుదాం

అయిజ: మున్సిపాలిటీలో సమస్యలు తిష్టవేశాయని, సమస్యల పరిష్కారం కోసం పోరాడుదామని అఖిలపక్షం కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. ఆదివారం పట్టణంలో అఖిల పక్షం కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలపై ప్రజల నుంచి వినతిపత్రాలు వచ్చాయని తెలిపారు. ముఖ్యంగా పెద్ద వాగుపై నిర్మించిన బ్రిడ్జికి అప్రోచ్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయించాలని, మేడికొండ రోడ్డుపై నిలిచిపోయిన బ్రిడ్జి పనులను పూర్తి చేయించాలని, పీహెచ్‌సీ వద్ద అసంపూర్తిగా నిలిచిపోయిన 30 పడకల ఆస్పత్రి భవన నిర్మాణం పనులను పూర్తిచేయించాలని వినతులు వచ్చినట్లు తెలిపారు. సమస్యలను పరిష్కారానికి నిరసన కార్యక్రమాలు చేపట్టాలని, అధికారులను, పాలకులను నిలదీయాలని కమిటీ సభ్యులను కోరారు. కార్యక్రమంలో మద్దిలేటి, విజయభాస్కర్ రెడ్డి, ఆంజనేయులు, తాహెర్, జగపతిరెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అఖిలపక్షం కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

అలంపూర్: దాడిలో గాయపడిని దళిత మహిళ ప్రశాంతమ్మ కుటుంబానికి అండగా ఉంటామని సీపీఎం జిల్లా కమిటీ ప్రతినిధి బృందం సభ్యులు అన్నారు. కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను సీపీఎం జిల్లా కమిటీ ప్రతినిధి బృందం సభ్యులు ఆదివారం పరామర్శించారు. మానవపాడు మండలం చిన్నపోతులపాడులో ప్రశాంతమ్మ బజ్జీల బండి ద్వారా జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 10న ఆమెపై అదే గ్రామానికి చెందిన కొందరు బజ్జీలు కాల్చే నూనెతో దాడి చేసినట్లు పేర్కొన్నారు. కాలే నూనె ఒంటిపై వేడయంతో ఆమె తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. గాయాలతో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. దాడి చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రశాంతమ్మ కుటుంబానికి సీఎం సహాయ నిధి నుంచి రూ.5 లక్షలు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రాజు, రేపల్లె దేవదాసు, జీకే ఈదన్న, రమేష్, మధు తదితరులు ఉన్నారు.

మానవపాడు: అలంపూర్ నియోజకవర్గంలో దళితులపై జరుగుతున్న దాడులను ఎమ్మెల్యే విజేయుడు ఖండించాలని సీపీఎం నాయకులు రాజు కోరారు. ఎమ్మెల్యే విజేయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ఖండించాలన్నారు. దాడి చేసిన వారిపై మర్డర్ కేసు నమోదు చేయాలని ఆదివారం హెడ్‌కానిస్టేబుల్ తిప్పన్నకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రాజు, దేవదాసు, పరంజ్యోతి, ఈదన్న, రమేష్, మధు, తదితరులు పాల్గొన్నారు.

గద్వాల అర్బన్: మానవపాడు మండలంలోని చిన్నపోతుల పాడులో దళిత మహిళపై అకారణంగా వేడి నూనె చల్లి దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో మహిళలపై అనేకదాడులు, లైంగిక వేధింపులు, హత్యలు, అత్యాచారాలు పెరుగుతున్నాయని, భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రశాంతమ్మను పరామర్శిస్తున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు

నిధులు మంజూరు చేయించండి

అయిజ: దేవాలయం అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలని ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులును కోరారు. దసరా పండుగ సందర్భంగా బక్కని నరసింహులు శనివారం మండలంలోని కట్టకింది తిమ్మప్ప స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడారు. అప్పటి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2012లో కట్టకింది తిమ్మప్ప ఆలయంలో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీఇచ్చారని, గతంలో టీటీడీ నుంచి రూ. 35 లక్షలు మంజూరు చేయించారని, ఇంకా రూ.50 లక్షల మంజూరు చేయించాల్సి ఉందని తెలిపారు. వెంటనే మిగిలిన నిధులు మంజూరు చేయించాలని కోరారు. స్పందించిన బక్కని నరసింహులు నిధులు సమకూర్చేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నరసింహులు, శ్రీను, వెంకటేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, టీడీపీ నాయకుడు సుధాకర్ గౌడ్, వివిధ పార్టీల, సంఘాల నాయకులు పాల్గొన్నారు.



అయిజలో కట్టకింది తిమ్మప్ప స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న బక్కని నరసింహులు

దేవబండ బ్రిడ్జికి మోక్షమెప్పుడో?



దేవబండ వాగుపై బ్రిడ్జి నిర్మించాల్సిన ప్రదేశం

- 20 ఏళ్లక్రితం శంకుస్థాపన
- నేటికీ విడుదలకాని నిధులు
- పట్టించుకోని అధికారులు

అయిజ: వాగుపై వంతెన నిర్మించకుంటే ప్రయాణానికి ఆటంకం కలుగుతుందని తెలిసినా, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని దేవబండ గ్రామం అయిజ పట్టణానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉంది. రెండింటి మధ్యన పెద్దవాగు ఉంది. గ్రామంలో సుమారు 800 జనాభా ఉంది. గ్రామ శివారులో 1792 ఎకరాల పంటపొలాలు ఉన్నాయి. మొత్తం 200 మంది రైతులు, 500 మంది కూలీలున్నారు. వాగుపై బ్రిడ్జి నిర్మించకపోవడంతో దేవబండ గ్రామ ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. 2003లో అప్పటి ఎమ్మెల్యే గట్టు భీముడు రూ.15 లక్షల అంచనాతో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. పెద్దవాగుపై బ్రిడ్జిని నిర్మించాలని అటు అధికారులతో, ఇటు నాయకులతో దేవబండ ప్రజలు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. దేవబండ–అయిజ మధ్యన పెద్దవాగుపై వంతెన లేకపోవడంతో వర్షాకాలం ఆ గ్రామ ప్రజలకు ఇతర గ్రామాలతో సంబంధాలు తెగిపోతాయి. వాగులో నీటి ప్రవాహం తగ్గేంత వరకు ప్రజలు వాగుదాటలేని పరిస్థితి నెలకొంటుంది.

వినతిపత్రాలు బుట్టదాకలు

బ్రిడ్జి నిర్మాణానికి 20 ఏళ్ల క్రితం శిలాఫలకం వేసినా నిధులు మంజూరు కాకపోవడంతో ఎలాంటి నిర్మాణ పనులు ప్రారంభించలేదు. 2005లో అప్పటి చిన్న పరిశ్రమల శాఖా మంత్రి డీకే అరుణకు, 2011లో అప్పటి కలెక్టర్ పురుషోత్తంరెడ్డికి, 2012లో అప్పటి ఎమ్మెల్యే అబ్రహంకు, 2013లో అప్పటి ఎంపీ మంద జగన్నాథంకు, 2018లో అప్పటి ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌కు దేవబండ ప్రజలు వినతిపత్రాలు సమర్పించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అధికారులతో మొరపెట్టుకుంటున్నా నిధులు మాత్రం మంజూరు కాలేదు. 2024 సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు దేవబండకు ఏర్పాటు చేసిన మట్టిరోడ్డు కొట్టుకుపోయింది. అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు సంఘటనా స్థలాన్ని సందర్శించిన సందర్భంగా బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు వినతిపత్రం అందజేశారు. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు

ప్రయాణానికి ఆటంకం



దేవబండ బ్రిడ్జిని నిర్మించాలని చాలా సంవత్సరాల నుంచి ప్రజలు వేడుకుంటున్నా ఇంత వరకు బ్రిడ్జి నిర్మాణం కాలేదు. దేవబండ శివారులో అయిజ, ఎక్లాస్‌పురం, బింగుదొడ్డి రైతుల పంటపొలాలు ఉన్నాయి. వర్షాకాలంలో వాగులో వరద ఉధృతి వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి బ్రిడ్జి నిర్మాణానికి కృషిచేయాలి.

– వెంకట్రాములు, బింగుదొడ్డి

రైతులకు ఇబ్బందులు..



ఎక్లాస్‌పురం గ్రామ రైతుల పంట పొలాలు దేవబండ గ్రామం సమీపంలో ఉన్నాయి. పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మించకపోవడంతో రైతులు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారు. వాగులో వరద పారినన్ని రోజులు రైతులు పొలం పనులకు వెళ్లలేరు. వచ్చే వానాకాలం నాటికి వంతెన నిర్మిస్తే బాగుంటుంది.

– తిమ్మప్ప, ఎక్లాస్‌పురం

నిధులు మంజూరు కాలేదు..

గతంలో దేవబండ వాగుపై బ్రిడ్జి నిర్మించేందుకు శంకుస్థాపన చేసినట్లు చెబుతారు. ఆఫీస్‌లో దానికి సంబంధించిన ఫైల్ లేదు. బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు లభించకముందే శంకుస్థాపన చేసి ఉండవచ్చు. దేవబండ వాగుపై బ్రిడ్జి నిర్మించేందుకు గతంలో ఏ అధికారులు నివేదికలు పంపినట్లు ఆధారాలు లేవు. ప్రజా ప్రతినిధులు అనుమతులు తీసుకొస్తే నిర్మాణం పనులు చేపడుతాం.

– భరత్, పంచాయతీ రాజ్ ఇన్‌చార్జి ఏఈ

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



శాంతినగర్: దసరా ఉత్సవాల్లో భాగంగా వడ్డేపల్లి మండలం తనగలలో చల్లా యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన టీపీఎల్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. మొదటి బహుమతి ఎస్‌ఎంఎస్ 11, ద్వితీయ బహుమతి కేఆర్‌బీ చాంపియన్స్ జట్లు కైవసం చేసుకున్నాయి. విజేతలకు చల్లా యూత్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు విష్ణువర్ధన్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాజశేఖర్, అశోక్‌లు పాల్గొన్నారు.

ఆలయ ఈఓకు సత్కారం



అలంపూర్: దేవి శరన్న నవరాత్రి ఉత్సవాలను విజయవంతానికి కీలకపాత్ర పోషించిన ఆలయ ఈఓ, ప్రధాన అర్చకుడిని ఆర్యవైశ్య సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. అలంపూర్ పట్టణంలోని కన్యకాపరమేశ్వరి నిత్య అన్నదాన సత్రంలో శ్రీజోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయ ఈఓ పురేందర్ కుమార్, ప్రధాన అర్చకులు డిండిగల్ ఆనంద్ శర్మను ఆర్యవైశ్య సంఘం అధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈఓ పురేందర్ కుమార్‌ను, ప్రధాన అర్చకుడు డిండిగల్ ఆనంద్‌శర్మను ఆర్యవైశ్య సంఘం నాయులు శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వేణయ్య, ప్రధాన కార్యదర్శి చిలుకూరి రమేష్ గుప్త, కోశాధికారి వెంకట్రామయ్య శెట్టి, నాయకులు శ్రీధర్, చిలుకూరి సతీష్ కుమార్, నాగరాజు, గోపాలకృష్ణయ్య, వేముల కృష్ణమూర్తి, మేడా చంద్రశేఖర్, తిరుపాల్ శెట్టి ఉన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



ఎర్రవల్లి: మండలంలోని యాక్తాపురంలో దసరా పండగను పురస్కరించుకొని యాక్తాపురం ప్రీమియర్ లీగ్–10ని నిర్వహించారు. ఆదివారం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు శ్రీధర్‌రెడ్డి హాజరై ఫైనల్ పోటీలకు ప్రారంభించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశాడు. కార్యక్రమంలో రామన్‌గౌడ్, నరేష్, బీసీరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



ధరూరు: క్రీడల్లో గెలుపోటములు సహజమని కాంగ్రెస్ మండల సీనియర్ నాయకులు డీఆర్ శ్రీధర్ తనయుడు శ్రీహర్ష అన్నారు. రేవులపల్లిలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. మొదటి బహుమతి గద్వాల, చింతరేవుల జట్లకు రూ.15,116 నగదు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, యోహను, నిర్వహకులు, గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా



కేటీదొడ్డి: ఇసుక అక్రమ రవాణా కొందరు అధికారుల అండదండలతో అక్రమార్కులు నిర్వహిస్తున్నారు. మండలంలోని గువ్వలదిన్నె వాగులో ఇసుకను మండలానికి చెందిన కొందరు వ్యక్తులు పగలు అంతా డంపులు చేసి రాత్రి సమయంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారు. ఎలాంటి అనుమతి తీసుకోకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. దీనిపై రెవెన్యూ అధికారి వివరణ కోరగా, ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతులు లేవని, అక్రమంగా ఇసుక నిల్వ ఉంచినా కఠిన చర్యలు తీసుకొని సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఎస్సీ హాస్టల్‌కు ప్రహరీ నిర్మించాలి



మల్దకల్: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌కు కూలిన ప్రహరీని నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామానికి దూరంగా ఈ వసతి గృహానికి ప్రహరీ కూలిపోవడంతో రాత్రివేళల్లో మందుబాబులు వసతి గృహంలోకి వెళ్లి పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనాఅధికారులు కూలిన ప్రహరీ నిర్మాణం చేపట్టి సమస్యను పరి ష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎంబీ చర్చిలో కోతకాల పండుగ



ధరూరు: మండల కేంద్రంలోని ఎంబీ షాలేం చర్చి, కల్వరి చర్చిల్లో కోతకాల పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా పంట కోత దశలో నిర్వించే ఈ కోతకాల పండుగను పుస్కరించుకుని ఆదివారం ధరూరులోని క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాస్టర్ సీపీ ప్రసాద్ యూధా కృతజ్ఞతల అర్పణల పండుగను ప్రవచనాల ఆధారంగా వివరించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, యూత్ పాల్గొన్నారు.